సీరియల్

అడుగు ముందుకు వేస్తే భస్మం!

వసుంధర

(మూడవ భాగము)

"నేను ముందే చెప్పానుగా. మనిషి చాలా మొండి వాడు. ఎంతటి ఘోరశిక్షనైనా భరిస్తాడు కానీ తను చెప్పకూడదనుకున్నది చెప్పడు..." అన్నాడు రఘునాథ్.

"అతని స్నేహితుడెవరో కానీ చాలా అదృష్టవంతుడు. గురువులు దగ్గర్నుంచి అన్ని లక్షలూ పుచ్చుకుని హాయిగా అనుభవిస్తున్నాడు" అన్నాడు శ్రీకృష్ణపరమాత్మ.

"ఇంతకూ మీకు గురువులుతో పనేమిటి?" అన్నాడు రఘునాథ్.

"ఏదో ప్రొఫెషనల్ క్యూరియాసిటీ_అంతే!" అంటూ

తల వెనక్కి వాల్చి కళ్ళు మూసుకున్నాడు శ్రీకృష్ణ పరమాత్మ.

రఘునాథ్‌కు ఈ శ్రీకృష్ణపరమాత్మ ఒక వింత మనిషిగా తోచాడు. అతని పేరే వింతగా వుందతనికి. అయితే రామకృష్ణ పరమహంస అని పేరు పెట్టుకున్న కొందరు మనుషులు అతనికి తెలుసు. అలాగే యిదీ ఓ పేరయివుంటుంది అనుకున్నాడతను.

ఇతనో ప్రయివేటు డిటెక్టివ్‌నని చెప్పాడు. మనుషుల చేత నిజం చెప్పించడానికి తనవద్ద కొన్ని పద్ధతులున్నాయనీ, అవి గురువులమీద ప్రయోగిద్దామనుకుంటున్నాననీ అతను రఘునాథ్‌కు చెప్పాడు.

ఏ పుట్టలో ఏ పాముంటుందో చూద్దామని రఘునాథ్ అంగీకరించాడు. అంగీకరించాడుకానీ అతడికి యింతో అంతో అతడిమీద అనుమానమూ కలిగింది. దూరాన్నించి ఓ కంట కనిపెడుతూనే వున్నాడు. శ్రీకృష్ణపరమాత్మ మాట్లాడిన ధోరణిని దూరాన్నించి చూసి పెద్దగా అనుమానించవలసింది లేదని రఘునాథ్ అనుకున్నాడు.

శ్రీకృష్ణపరమాత్మ మళ్ళీ కళ్ళు తెరిచాడు—"నాకు కళ్ళు తిరుగుతున్నాయి" అన్నాడు.

"ఏమయింది?" అన్నాడు రఘునాథ్.

"ఏమో తెలియడం లేదు" అంటూ తల వెనక్కి వాల్చి "నాకు చాలా నీరసంగా వుంది. ఏదైనా ఏర్పాటు చేస్తే ఇక్కడే పడుకుంటాను" అన్నాడు.

రఘునాథ్ అప్పటికప్పుడు ఓ మడతమంచం తెప్పించి అక్కడే వేయించాడు. శ్రీకృష్ణపరమాత్మ నెమ్మదిగా లేచివెళ్ళి మంచంమీద కూర్చుని కాసిని మంచినీళ్ళు తాగి పడుకున్నాడు. రఘునాథ్ అతడిగురించి ఓ కానిస్టేబుల్ని కాపలా వుంచాడు.

పరమాత్మ కాసేపటికి గాఢనిద్రలోపడ్డాడు. అతడు కొద్దిగా గుర్రుకూడా పెడుతున్నాను. రఘునాథ్ తనలో తనే నవ్వుకొని గురువులుకు సంబంధించిన ఫైలంతా తిరగేయసాగాడు.

తర్వాత రెండు గంటలకాక్కాబోలు ఓ కానిస్టేబులు కంగారుగా పరుగెత్తుకుంటూ వచ్చి "గురువులు కండిషన్ ప్రమాదకరంగా వుంది సార్. మనిషి శరీరం నల్లగా మారి పోయింది" అన్నాడు.

రఘునాథ్ కంగారుపడి లేచాడు. అప్రయత్నంగా అతనిదృష్టి పరమాత్మమీదకు మళ్ళింది. అతనింకా గుర్రు పెడుతూనే వున్నాడు.

* * *

గురువులు కళ్ళువిప్పి చూశాడు. గదిలో తనొక్కడే వున్నాడు. తన శరీరం నల్లగా మారిపోయింది. మాను కుందుకు బాగోలేదు.

"ఇప్పుడేం జరుగుతుంది?" అని ఆలోచిస్తున్నాడు గురువులు. తనకు వైద్యం జరిగి మళ్ళీ మామూలు మనిషి అవుతాడా, లేక ఎప్పటికీ ఇలాగే వుండిపోతాడా? శరీరపు రంగు మారిందికానీ తనకేమీ బాధగాలేదు. కానీ బాధను నటించాడు. బలమైన ఇనుపసంకెళ్ళలో బంధించి తనను హాస్పిటల్‌కి తీసుకువచ్చారు.

గురువులినలా తీసుకువచ్చినందుకు డాక్టర్ బాధపడితే "డాక్టరుగారూ వీడి సంగతి మీకు తెలియదు. వీడిపేరు గురువులు. ఆరితేరిన గజదొంగ. నరరూప రాక్షసుడు" అని చెప్పాడు ఇనస్పెక్టర్ రఘునాథ్.

ఆ మాటలు విని గురువులు తనలో తనే నవ్వుకున్నాడు. అప్పుడు డాక్టర్ ఏదో ఇంజక్షన్ ఇచ్చాడు. నిద్ర పట్టేసింది. మళ్ళీ యిప్పుడే మెలకువ వచ్చింది.

గురువులు ఏదో ఆలోచిస్తూండగానే డాక్టర్ గదిలోకి ప్రవేశించాడు. గురువులు చటుక్కున లేచి కూర్చోబోయాడు.

డాక్టర్, గురువుల్ని సమీపించి "నేను శ్రీకృష్ణపరమాత్మను విశ్వసిస్తాను. అతడు ఇష్టపడ్డవారందర్నీ రక్షించడం నా విధి" అన్నాడు.

గురువులు ఆశ్చర్యపోయాడు. వాడికళ్ళలో హఠాత్తుగా ఆశ తొంగిచూసింది. తను తప్పించుకోడం నిజమని వాడికి అనిపించసాగింది. పైకిమాత్రం ఏమీ తెలీకుండా "డాక్టర్ నా వ్యాధి నయమవుతుందంటారా?" అన్నాడు.

డాక్టర్ తన చేతికివున్న వాచీ మీటనొక్కాడు. కాసేపు తర్వాత మళ్ళీ మీటనొక్కాడు. "నీ వ్యాధి యింకో రెండుగంటల్లో నయమవుతుంది. నీకు లేచి తిరిగే ఓపిక లేదనీ అటువంటి ఓపిక కలగడానికి ఇరవై నాలుగ్గంటలు పడుతుందనీ పోలీసులకు చెప్పాను. బయట చెప్పుకోదగ్గ కాపలా ఏమీ లేదు. ఈ రాత్రికి నువ్వు నీ పద్ధతిలో బయటపడ్డానికి ప్రయత్నించు."

"శ్రీకృష్ణపరమాత్మ ఏంచేస్తున్నాడు?" అన్నాడు గురువులు.

"ఎలిబీకోసం పోలీస్టేషన్లో నిద్రపోతున్నాడు."

"నేను బయటపడ్డాక స్వేచ్ఛాజీవినౌతానా?"

"కావు, కాలేవు. శ్రీకృష్ణపరమాత్మ అనుచరులు నిన్ను కనిపెట్టే వుంటారు."

"అయితే నేనిప్పుడేం చేయాలి?"

"పోలీసుకళ్ళ బడకుండా బయటపడు. నిన్ను కలుసుకో వలసిన వాళ్ళెలాగూ కలుసుకుంటారు."

గురువులు ఆశ్చర్యంగా "నేను బయటపడితే మీ కేమీ ఇబ్బంది వుండదా?" అన్నాడు.

"అన్నింటికీ శ్రీకృష్ణపరమాత్మ వున్నాడు" అని వెళ్ళిపోయాడు డాక్టర్.

గురువులుకు మళ్ళీ కాసేపు నిద్రపట్టింది. వాడికి మెలకువ వచ్చేసరికి గదిలో డిమ్‌గా లైట్ వెలుగుతోంది. వాడోసారి తన శరీరం వంక చూసుకున్నాడు. నల్లరంగు పోయింది.

గురువులు చటుక్కున లేచి కూర్చున్నాడు. కాళ్ళూ చేతులూ అన్నీ స్వాధీనంలో వున్నాయి. డాక్టర్‌ని మనసులో అభినందించుకుని వాడు పక్కమీంచి దిగాడు. దగ్గర్లో వున్న కిటికీ దగ్గరకు వెళ్ళాడు.

ఓసారి అంతా పరీక్షించుకుని కిటికీలోంచి బయటకు వచ్చాడు. అక్కడినుంచి క్రిందకు చాలాదూరముంది. క్రింద నలుగురు కానిస్టేబుల్సు తిరుగుతున్నారు.

గురువులు తాపీగా ఓ పైపుగొట్టాన్నందుకుని క్రిందకు జారసాగాడు. అలా జారుతూ మొదటి అంతస్తుకు వచ్చాడు. అక్కడ కిటికీపై సమతలంగావున్న ప్రదేశం మీదకు మారి అక్కడ ఆగాడు. అక్కణ్నించి క్రిందకు దిగడానికి ఏమిప్రయత్నం చేసినా క్రిందనున్న పోలీసుల కళ్ళబడక తప్పదు. యిప్పుడేం చేయాలి? ఇక్కణ్నుంచి ఎలా బయటపడాలి?

గురువులు ఆలోచిస్తూండగా అలా ఒక కారు వచ్చింది. అప్పుడే గురువులుకొక ఆయిడియా వచ్చింది. ఆ కారు వెళ్ళిపోయింది. క్రిందకు ఎంతోదూరం లేదు. ఆ మాత్రపు దూరం ప్రాణాపాయం లేకుండా గెంతగలడు. ఒకసారి హాస్పిటల్ గేటు దాటి బయటపడితే...

మళ్ళీ ఇంకో కారు వస్తోంది. గురువులు ఆలస్యం చేయ లేదు. వాడు ఊపిరిబిగబట్టి ఒక గెంతు గెంతి కారుమీదకు

దూకాడు. ఏం జరిగిందో తెలిసేలోగా కారు హాస్పిటల్ గేటుదాటి అక్కడ ఆగింది. ఈలోగా గురువులు కారు మీంచి క్రిందకు గెంతి మెరుపులా మాయమయ్యాడు.

హాస్పిటల్ కాంపౌండులోంచి పోలీసులు పరిగెత్తుకు వచ్చారు. "ఏం జరిగింది?" అంటూ అడిగారు ఆపిన వ్యక్తిని.

"ఏదో కారుమీద పడ్డట్టయింది. అది గ్రహించి కారు ఆపేసరికి ఏదో కారుమీంచి దూకినట్లయింది, అంతే" అన్నాడు కారులోని వ్యక్తి.

* * *

గురువులు కారుదూకి కనబడ్డ సందులో ప్రవేశించాడు. ఆ సందులో చివర ఒకమనిషి అతడికి కనిపించాడు.

అతడు కాకీదుస్తుల్లో ఉన్నట్టుగా గురువులుకు అనుమానం కలిగింది. అతడు పోలీసుల మనిషా లేక శ్రీకృష్ణ పరమాత్మ మనిషా లేక మామూలుగా సందులో వున్నాడా?

మూడో విషయం నమ్మదగ్గదిగా కనబడలేదు గురువులుకు. అతనక్కడ ఎవరికోసమో యెదురు చూస్తున్నట్లుగా వున్నాడు. పోలీసుల మనిషయితే తనతో సంబంధము లేని మరో పనిమీద అక్కడ ఉండివుండాలి. అయినప్పటికీ తనను చూస్తే వెంటనే గుర్తుపట్టగలడు. ఇప్పుడు గురువుల్ని తెలియని కాకీ దుస్తులవాడుండడు.

అలాకాకుండా శ్రీకృష్ణపరమాత్మ మనిషయుంటే తనకోసమే అక్కడ నిలబడి వుంటాడు. ఈ విధంగా తను ఈ సందులోకి వస్తానని అతడు ముందే ఊహించి వుండాలి. లేదా తను పైపు దిగడం ప్రారంభించినప్పటి నుంచి తనను కనిపెడుతూండి వుండాలి.

ఎవ్వరికో తెలియనప్పుడు అతని దగ్గరకు వెళ్ళడము ప్రమాదం. శ్రీకృష్ణపరమాత్మ మనిషయితే ఎలగూ తన వద్దకు తనంతట తనే వస్తాడు. ఎవరూ రాకపోయినా తనకు బాధలేదు. మరీమంచిది.

అసలీ శ్రీకృష్ణపరమాత్మ ఎవరు? అతడు తననుంచి ఆశిస్తున్న ప్రయోజనమేమిటి?

గురువులు ఎక్కువగా ఆలోచించలేదు. ఆ సందు చివర వరకూ వెళ్ళకుండా మధ్యలో ఇంకోవీధి వస్తే పక్కకు తిరిగాడు. గమ్యంలేకుండా అలా ఎంతదూరం పోవాలో నిర్ణయించుకోలేదతనింకా.

తనకు వెనుకగా కా సమూరంలో ఏదో అడుగులచప్పుడవుతున్నట్లుతోచి వెనక్కు చూశాడు గురువులు. ఓ కాకీదుస్తులమనిషి తనను సమీపిస్తూ ఆగమన్నట్లు సైగ చేస్తున్నాడు. బహుశా ఇందాకటి సందులో మనిషే అయుంటాడు.

గురువులు ఆగాడు. ఆ మనిషి అతన్ని సమీపించి ఓ చిన్నకాగితం ఇచ్చి, "నువ్వీ ఇంటికి వెళ్ళాలని శ్రీకృష్ణ పరమాత్మ ఆదేశం. ఆ ఇంట్లో ఇద్దరే మనుషులుంటారు. తాత, మనవడు. ఇల్లు చాలా విశాలమైనది. వాళ్ళిద్దరికీ తెలీకుండా చాలాసేపు గడపవచ్చు నువ్వు. కర్మంచాలక దొరికిపోతే మాత్రం శ్రీకృష్ణపరమాత్మ పేరుచెప్పు. నీకే ప్రమాదమూ ఉండదు" అన్నాడు.

"ఇప్పుడే వెళ్ళాలా?" అన్నాడు గురువులు ఆ చీటీ మీది అడ్రసు చూస్తూ.

"అవును. పోలీసులు నిన్ను వేటాడడాని కింకంతో సేపు పట్టదు" అన్నాడు కాకీదుస్తుల మనిషి.

"ఆ ఇంట్లో ఎంతసేపుండాలి?"

"శ్రీకృష్ణపరమాత్మనుంచి మళ్ళీ నీకు ఆదేశం అందే వరకూ."

"వాళ్ళెవరు?"

"మనకు సంబంధించిన మనుషులు కాదు. కానీ శ్రీ కృష్ణపరమాత్మకు బంధువులు" అన్నాడు కాకీదుస్తుల మనిషి.

గురువులు ఇంకేమీ ప్రశ్నలు వేయలేదు. కాకీదుస్తులు మనిషి వెళ్ళిపోయాడు. గురువులు మరోసారి ఆ అడ్రసు చూసుకున్నాడు. చకచకా అడుగులు వేశాడు. ఆ ఇల్లు అక్కడికి మరీ దూరంలో లేదు.

సుమారు పదినిముషాల్లో గురువులు ఓ బంగళాముందు ఆగాడు. అచ్చటి వాతావరణం చాలా ప్రశాంతంగా ఉందనిపించిం దతనికి. చక్కటి అందమయిన బంగళా. చుట్టూ తోట. చిన్న కాంపౌండ్ వాల్. ఒక చిన్న గేటు. గేటుకు తాపలా లేదు.

గేటు తీసుకుని లోపలకు ప్రవేశించాడు గురువులు. వీధి తలుపులుకూడా వేసిలేకపోవడం ఇంకా ఆశ్చర్యమనిపించింది గురువులుకు. తోసుకొని లోపల ప్రవేశించాడు. ఒకపర్యాయం చుట్టూ పరిశీలించి ఇంట్లోకి దారులన్నీ ఆకళింపు చేసుకున్నాడు.

ఇల్లు పెద్దదిగానే ఉందికానీ ఇంట్లోవాళ్ళకి తెలియకుండా ఇందులో దాక్కోవాలంటే చాలా ఇబ్బందిగానే ఉంటుంది.

గురువులు ఓ గదిలోకి వెళ్ళిపోయాడు. చిన్న దగ్గు లాంటిది అతనికి వినిపించింది. ఆ దగ్గువచ్చివైపే అతను చప్పుడు చేయకుండా నడిచాడు.

అక్కడ రెండు మంచాలున్నాయి. ఓ మంచంమీద ఓ ముసలాయన పడుకుని ఉన్నాడు. ఆయనకు పక్కన

వున్న స్టూలుమీద టేబిల్ లైట్ వుంది. ముసలాయన చేతిలో చాలా లావుపాటి పుస్తకం వుంది. ఆయన ఆ పుస్తకాన్ని తెరచి గుండెలమీద పెట్టుకొని ఏకదీక్షతో దానివైపే చూస్తూన్నాడు రెండు చేతులతోటీ పట్టుకొని. మధ్యమధ్యలో ఆయనకు దగ్గువస్తోంది.

రెండో మంచంమీద ఓ యువకుడు నిద్రపోతున్నాడు.

గురువులు గది గుమ్మందగ్గర ఆగినప్పుడు ముసలాయన మళ్ళీ దగ్గాడు. ఈసారి ఆయనకు దగ్గు తెరలు తెరలుగా వచ్చింది. ఊపిరి సలుపుకోలేక పోయాడు. ఆయన ఆదే పనిగా దగ్గుతూంటే పక్క మంచంమీద పడుకున్న యువకుడికి మెలకువ వచ్చింది. చటుక్కున లేచికూర్చుని "తాతా! నిద్ర పట్టలేదా?" అన్నాడు.

"పట్టిందిరా. కానీ మెలకువ వచ్చి చాలా సేపయింది. పుస్తకం చదువుకుంటున్నాను. వెధవ దగ్గు నాప్రాణం తీసేస్తోంది" అన్నాడు తాత.

"నిన్నటిదాకా లేని దగ్గు ఈ రాత్రి వచ్చినట్లుంది. జలుబు చేసిందేమో!" అన్నాడు మనవడు. కలవరపాటు అతడి ముఖంలో కనబడుతుంది.

"అవున్రా—ముసలివాడినై పోతున్నాను. ఏక్షణంలో ఏ ప్రమాదం వస్తుందో తెలియదు. నీకింక ఆ రహస్యం చెప్పేయక తప్పదు" అన్నాడు తాత.

"ఏ రహస్యం?" అన్నాడు మనవడు.

"అదేరా—అపూర్వనిధి రహస్యం" అన్నాడు తాత.

"నిజంగానా తాతా-ఇప్పుడే చెబుతావా?" అన్నాడు మనవడు. అతడి కళ్ళు ఉత్సాహంతో మెరుస్తున్నాయి.

"అవున్రా, యేదో ఒకరోజున చెప్పక తప్పదు. ఆలస్యం చేసినకొలదీ అది మనచేయి దాటిపోతుంది. అందు

లోనూ నా ఆరోగ్యమొకటి అంత బాగుండడం లేదు'' అన్నాడు తాత.

"నీ ఆరోగ్యానికీ దీనికీ ముడిపెట్టొద్దు" అన్నాడు మనవడు.

"ఈ ప్రపంచంలో నువ్వొకప్ప ఇంకెవ్వరూ లేరు నాకు. అయిన వాళ్ళందరూ పోయినప్పటికీ నిన్ను చూసుకునే గదా నేను బ్రతుకుతున్నాను. అలాంటప్పుడు నీలో ఆవేశాన్ని రగిల్చి, ఉత్సాహాన్నుద్రేకించి అపూర్వనిధికై పంపి నానుంచి ఎలా దూరం చేసుకోను?''

"సంవత్సరంనుంచి చెబుతున్నావు అపూర్వనిధిగురించి. తీర్థయాత్రలకు వెళ్ళి వచ్చినప్పటినుంచి నీ ధోరణిలో చాలా పెద్దమార్పు వచ్చింది. ఎంత అడిగినా యేం జరిగిందో చెప్పవు?'' అన్నాడు మనవడు.

"ఇప్పుడు చెబుతున్నాగా'' అన్నాడు తాత.

మనవడితోపాటు గురువులుకూడా ఆ వివరాలు విన సాగాడు.

* * *

వాళ్ళు మొత్తం నలుగురు.

తీర్థయాత్రలకని వివిధ ప్రాంతాలు తిరుగుతూ కన్యాకుమారివద్ద కలిశారు.

నలుగురిలోకీ రామేశం ముసలివాడు. ఆయన వయస్సు అరవైకి దగ్గరలోవుంది. అందరిలోకీ కుర్రవాడు జోహారీ. అతడింకా ముప్పయ్యోపడిలో పడలేదు. మిగతావాళ్ళు యిద్దరూ నలభయ్యోపడిలో వున్నారు. ఒకడు టాకూర్ రెండోవాడు జోగారావు.

జోహారీ ఉత్తరప్రదేశ్‌కు చెందినవాడు. టాకూర్ మిగతా ఇద్దరూ తెలుగువాళ్ళు. వయస్సులోనూ, భాషల లోనూ భేదాలున్నప్పటికీ చాలా విషయాల్లో వాళ్ళ అభి

ప్రాయాలు కలిశాయి. కన్యాకుమారి దగ్గర్నుంచి వారు మధుర, రామేశ్వరం వగయిరా తీర్థయాత్రలన్నీ సందర్శించడమయ్యాక నాత్రిండియన్నిద్దరూ తెలుగుదేశం వస్తామని చెప్పారు. హృదయపూర్వకమైన ఆహ్వానం వారికి యిచ్చారు తెలుగువాళ్ళిద్దరూ.

సుమారు పదిరోజులపాటు తెలుగుదేశం తిరిగారు ఈ నలుగురూ. అందుకోసం ఓ టాక్సీ బేరమాడుకున్నారు. వాళ్ళను దేశమంతా తిప్పడానికి టాక్సీవాడు అంగీకరించాడు.

రాజమండ్రికి దరిదాపుల్లో ఓ అడవివుంది. ఆ అడవిలో ప్రమాదకరమయిన ఆటవిక జాతులుకొన్ని నివసిస్తున్నాయని చెప్పుకొంటారు. ఆ ఆటవిక జాతులవారికి భాషాసంస్కారముంది. నాగరికతతో సంపర్కముంది. అయినప్పటికీ వారు అడవినివదలి బయటకురారు. తమ జీవన విధానాన్ని మార్చుకోరు.

రామేశంద్వారా ఈ విషయం విన్న నాత్రిండియన్సు ఆ ఆటవికులను చూడాలని ఉత్సాహపడ్డారు. మార్గం మరీ అంత సుకరం కానప్పటికీ టాక్సీవాలా కూడా ఆ ఆటవికులను చూడాలని ఉత్సాహంగావుంది. అందువల్ల అంగీకరించాడు.

ఆ ఆటవికుల గురించి వినడమేకానీ రామేశంకూడా చూడలేదు. అప్పుడప్పుడు వారు నగరాలకు వచ్చి పులిచర్మాలు, జింకచర్మాలు, మూలికలు వగయిరాలమ్ముతుంటారు. వారు నగరానికివచ్చి వెడుతుండటమే కానీ-ఆ ఆటవికుల ప్రాంతానికి నగరవాసులు వెళ్ళడం జరగదు. అదీకాక అది బాగా నిర్లక్ష్యం చేయబడ్డ ప్రాంతం. అటువేపు సరయిన రోడ్లుకానీ, దారులుకానీ ఏర్పడలేదు.

టాక్సీ ఒక పల్లెటూళ్ళో ఆగేక రామేశం తనప్రయా

ణము గురించి వాకబు చేశాడు. గంగాపురమనే పేరుగల ఆ గ్రామం తరవాత నాగరికత మరి కనపడకపోవచ్చునని ఆయన అభిప్రాయపడ్డాడు.

ఆఊళ్ళో ఓ చిన్న కాఫీహోటలుంది. దాని యజమాని చిన్నయ్య వాళ్ళకు ప్రయాణం వివరాలు చెప్పాడు. అతను చెప్పిన ప్రకారం ఆ ప్రయాణం సుకరమయినది కాదు.

ఊరిచివర కొండవుంది. ఆ కొండమీద సన్నని బాట వుంది. ఆబాట పట్టుకుని బయలదేరాలి. ఆ దారిలోనే ఆటవికు లా గ్రామానికి వచ్చి వెడుతుంటారు. ఆ దారిలో ప్రయాణించడం ఆటవికులకుతప్ప ఎవ్వరికీ సాధ్యపడదని ఊళ్ళో చెప్పుకుంటుంటారు.ఆ ఆటవికులుండే చోటికి వెళ్ళడానికి గంగాపుర గ్రామ పెద్దల అనుమతి తీసుకోవాలి.

నలుగురూ ఆ ఊరి ప్రెసిడెంటును కలుసుకున్నారు. ప్రెసిడెంటు వీరి కోరికవిని అసమ్మతిని సూచించే ముఖం పెట్టాడు.

“ఇదివరలో ఇలాగే ముగ్గుర్ని వెళ్ళనిచ్చాం. మళ్ళీ వెనక్కు రాలేదు. అప్పట్నించి అలా యెవ్వరినీ వెళ్ళనివ్వడంలేదు.” అన్నాడు ప్రెసిడెంటు.

“మేము వెళ్ళితీరాలి” అన్నాడు రామేశం. “మాలో ఎవ్వరికీ ప్రాణభయం లేదు. జాతకాల ప్రకారం అంతా నూరేళ్ళు బ్రతికేవారే!”

“అయితే మీ ఇష్టం. కొండదగ్గర్నుంచి ఓ చుట్టు దారివుంది. ఇలా వెడితే పాతిక కిలోమీటర్ల దూరంలో వుండే ఆ ప్రాంతం, చుట్టుదారిన వెడితే డెబ్బయి కిలో మీటర్లుండవచ్చు. చుట్టుదారిలో కూడా ప్రమాదాలు వుంటాయి. నరబలులనిచ్చే తెగవారొకరచ్చట వుంటున్నారని చెప్పుకుంటూంటారు. నాగరికులను వారు వదలి పెట్టరంటారు” అన్నాడు ప్రెసిడెంటు. (సశేషం)